4న చంద్రబాబు రాక

» మాడుగులలో 'రా.. కదలి రా' సభ



అనకాపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఫిబ్రవరి 4వ తేదీన జిల్లాకు రానున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఆదివారం మాడుగులలో నిర్వహించే 'రా... కదలి రా!' బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సభకు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టీడీపీతోపాటు జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

తప్పుల కుప్పలు!


అసమగ్రంగా తుది ఓటర్ల జాబితాలు

» రెండు, మూడేళ్ల క్రితం చనిపోయిన వారికీ ఓట్లు!




తప్పులున్న ఓటరు జాబితాను చూపుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు, బుద్ద నాగజగదీశ్వరరావు

- వలస వెళ్లిన వారి పేర్లను జాబితాల నుంచి తొలగించని బీఎల్‌వోలు
- ఒక పోలింగ్ బూత్ పరిధిలో నివాసం.. మరో పోలింగ్ బూత్‌లో ఓట్లు
- ఎన్నికల అధికారుల తీరుపై విపక్షాలు అభ్యంతరం
- తుది జాబితాలను నిర్లక్ష్యంగా తయారు చేశారని ఆరోపణ
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెల్లడి


3
TGM1651330
ఓటరు పేరు : జగ్గారావు వీరాల
వయస్సు : 70

అనకాపల్లి నియోజకవర్గం 234వ పోలింగ్ బూత్ వరుస సంఖ్య 3లో వున్న వీరాల జగ్గారావు రెండేళ్ల క్రితం మృతిచెందారు. అయినా పేరును తొలగించలేదు.


AEX1201672
2
ఓటరు పేరు : కొండబాబు గూటాల
ఇంటి సంఖ్య : 3-66
వయస్సు : 50

అనకాపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల అధికారులు ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాల్లో కూడా అనేక తప్పులు దొర్లాయి. రెండు, మూడేళ్ల కిందట మరణించిన వారి పేర్లు సైతం జాబితాల్లో కనిపిస్తున్నాయి. ఒక వార్డులో నివాసం వుంటున్న వారికి మరో వార్డులో ఓట్లు వున్నాయి. డోర్ నంబర్లు మారి పోయాయి. చాలా ఏళ్ల క్రితం వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను తొలగించలేదు. ఇంకా పలు ఎన్నో చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. గత ఏడాది ముసాయిదా ఓటరు జాబితాల్లో తప్పులు విపరీతంగా వున్నాయని, వీటిని సరిచేయకుండానే తుది ఓటరు జాబితాలను అధికారులు విడుదల చేశారని ప్రతిపక్షాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 22వ తేదీన ఎన్నికల అధికారులు విడుదల చేసిన ఓటరు జాబితాలను బూత్‌ల వారీగా క్షుణ్ణంగా పరిశీలిస్తున్న విపక్ష నేతలు.. లెక్కకు మిక్కిలిగా వున్న తప్పిదాలను చూసి విస్తుపోతున్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో చాలా మంది పేర్లు తాము నివాసం వుంటున్న పోలింగ్ కేంద్రం పరిధిలో కాకుండా వేరే పోలింగ్ కేంద్రంలో వుండడాన్ని టీడీపీ నాయకులు సోమవారం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముసాయిదా ఓటరు జాబితాల రూపకల్పన కన్నా చాలా ముందు చనిపోయిన వారిలో పలువురి పేర్లు తుది ఓటరు జాబితాల్లో ప్రత్యక్షమయ్యాయి. బూత్ స్థాయి ... మిగతా 8వ పేజీలో

ఓటరు జాబితాల తయారీలో నిర్లక్ష్యం

- చనిపోయిన వారి పేర్లు తొలగించని బీఎల్‌వోలు
- వివాహమై అత్తవారింటికి వెళ్లినా.. సొంతూరునేలో ఓట్లు

సరుగుడు గ్రామానికి చెందిన గూటాల కొండబాబు చనిపోయి చాలా కాలం అయినప్పటికీ ఓటరు జాబితాలో కొనసాగుతున్న పేరు

నాతవరం, జనవరి 30: తుది ఓటరు జాబితాల తయారీకి సంబంధించి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన కలెక్టర్ ఎన్నిసార్లు సమావేశాలు నిర్వహించినా, క్షేత్రస్థాయిలో తనికీలు చేసినా.. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) తమ తీరు మార్చుకోలేదు. తప్పుల తడకలతోనే తుది జాబితాలను విడుదల చేశారు. మూడేళ్ల క్రితం చనిపోయిన వక్తుల పేర్లు, వివాహమై వేరే గ్రామాల్లో అత్తవారింటికి వెళ్లిపోయిన మహిళలు, ఉద్యోగం లేదా ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను ఓటరు జాబితాల్లో నుంచి తొలగించలేదు. కొంతమందికి రెండేసి ఓట్లు వున్నాయి. మండలంలో దాదాపు అన్ని పంచాయతీల్లో ఇటువంటి పొరపాట్లు అనేకం వున్నాయి. పి.జగ్గంపేటలో జీరెడ్డి నాగమణికి పోలింగ్ బూత్ నంబరు 67లో (ఏఈఎక్స్ 2024875), బూత్ నంబరు 68లో(ఏఈఎక్స్ 1371483) ఓట్లు వున్నాయి. ఇదే గ్రామానికి చెందిన డొంక చిన్నయ్యనాయుడుకు పోలింగ్ బూత్ నంబరు 67లో (ఏఈఎక్స్ 1331149), బూత్ నంబరు 68లో (ఏఈఎక్స్1771732) ఓట్లు వున్నాయి. సరుగుడు గ్రామానికి చెందిన పైల వీరబాబు చనిపోయినప్పటికీ ఓటరు లిస్టులో (ఏఈఎక్స్ 1201581) ఓటుహక్కు ఉంది. ఇతని పేరును ఓటరు లిస్టు నుంచి తొలగించాలని బీఎల్‌ఓకు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. అలాగే గూటాల కొండబాబు చనిపోయినప్పటికీ (ఏఈఎక్స్ 1201672) ఓటరు లిస్టులో పేరు వుంది. సరుగుడు గ్రామానికి చెందిన లోచల విజయశాంతికి ఐదేళ్ల క్రితం వివాహమై అత్తారింటికి వెళ్లిపోయింది. అయినా సరే సరుగుడులో ఆమెకు ఓటు (ఏఈఎక్స్ 0991662) ఉంది. సాగిన సింహచలం (మహిళ) వివాహమై కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ధర్మవరంలో అత్తారింటికి వెళ్లిపోయింది. ఆమెకు కూడా సరుగుడులో (ఏఈఎక్స్ 1012723) ఓటు హక్కు ఉంది. ఇది మచ్చుకు కొన్ని ఉదాహరణలేనని, మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఇటువంటి తప్పిదాలు ఎన్నో వున్నాయని విపక్ష నేతలు చెబుతున్నారు.

డి.పట్టా భూముల్లో వైసీపీ నేతలు పాగా!

పిసినికాడలో అధికార పార్టీ నాయకుల భూ దందా

- పట్టాదారులను బెదిరించి కారు చౌకగా భూములు హస్తగతం
- మార్కెట్ విలువ ఎకరా రూ.60-80 లక్షలు
- పట్టాదారులకు ఇచ్చింది ఎకరాకు రూ.13.5 లక్షలు!
- స్వాధీనం చేసుకున్న భూముల్లో రేయింబవళ్లు యంత్రాలతో చదును పనులు
- గెడ్డలు, కాలువలు మట్టితో పూడ్చివేత
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, పంచాయతీ, గనుల శాఖల అధికారులు



ఎత్తు పల్లాలను సరిచేస్తున్న ఎక్స్‌కవేటర్లు

అనకాపల్లి/కొత్తూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో అధికార వైసీపీ నాయకుల భూదాహానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఖాళీగా వున్న ప్రభుత్వ బంజరు భూములపై వాలిపోతున్నారు. చివరకు పేద రైతులకు ప్రభుత్వాలు ఇచ్చిన డి.పట్టా భూములను సైతం వదలడం లేదు. తాజాగా అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ పరిధిలో పేద రైతులను నయానో భయానో తమ దారిలోకి తెచ్చుని సుమారు 42 ఎకరాల డి.పట్టా భూములను హస్తగతం చేసుకున్నారు. మార్కెట్ విలువ ప్రకారం ఇక్కడ ఎకరా రూ.70 లక్షల వరకు వుండగా, అధికార పార్టీ నేతలు ఇందులో ఐదు వంతు ధరకే డి.పట్టా భూములను కొట్టేశారు. అంతేకాక వారం రోజుల నుంచి ఆయా భూములను యంత్రాలతో చదును, లెవెలింగ్ చేయిస్తున్నారు. కోట్లాది రూపాయల భూ దందాకు సంబంధించి వివరాలిలా వున్నాయి.**

అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీ బీఆర్.టీ. కాలనీలో సర్వే నంబర్లు 362, 363, 364, 365, 366, 367, 368, 369, 370, 371లలో సుమారు 80 ఎకరాల బంజరు భూములు ఉన్నాయి. 1976లో 33 మంది పేద రైతులకు అప్పటి ప్రభుత్వం భూమిని పంపిణీ చేసి డి.పట్టాలు అందజేసింది. లబ్ధిదారులు కొంతకాలంపాటు సరుగుడు తోటలు సాగు చేసుకున్నారు. అనంతరం భూములను ఖాళీగా వదిలేశారు. ఈ నేపథ్యంలో 2013లో 'మీ-భూమి' ఆన్‌లైన్ విధానం అమల్లోకి రావడంతో అప్పట్లో ఇక్కడ వీఆర్‌ఏగా పని చేసిన ఓ వ్యక్తి, తన కుటుంబానికి చెందిన 12 మంది పేర్లతో 41 ఎకరాల 47 సెంట్లకు డి.పట్టాలు ... మిగతా 8వ పేజీలో

80 ఎకరాలకు మంత్రి టెండర్

- మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపణ
- 1970లో పట్టాలు పొందిన వారిని పక్కనపెట్టి కొత్త వారిని తెరపైకి తెచ్చారు
- ల్యాండ్ పూలింగ్‌లోనూ అక్రమాలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు

-వార్త 7వ పేజీలో



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న రోహిత్ శర్మ

క్రికెట్ సందడి

2 నుంచి విశాఖలో టెస్ట్ మ్యాచ్

» నగరానికి చేరుకున్న భారత్, ఇంగ్లండ్ క్రికెటర్లు



ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్

విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో వచ్చే నెల రెండో తేదీ నుంచి జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో పాల్గొనే భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు మంగళవారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. ఇందులో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు బుమ్రా, అశ్విన్, అవేష్ ఖాన్, శ్రీకర్ భరత్, శ్రేయాస్ అయ్యర్, యశస్వి జైస్వాల్, సర్ఫాజ్ ఖాన్, మహ్మద్ సిరాజ్, కులదీప్ యాదవ్, ముకేష్‌కుమార్, అక్షర పటేల్, సౌరబ్‌కుమార్, శుభమన్ గిల్, వాషింగ్టన్ సుందర్, ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్, పోప్, బెయిరిస్టో, ఫోక్స్, హార్డ్లీ, లీచ్, క్రాలే, జేమ్స్ అండర్సన్, తదితరులు ఉన్నారు. బుధ, గురువారం ఇరుజట్ల ఆటగాళ్లు నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.

ల్యాండ్ ఫిల్‌కు అనుమతి వద్దు

- ఊరును తరలించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోలేదని ఆవేదన
- ఫార్మా కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి: జనసేన జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఎందుకు హాజరు కాలేదు?: బండారు అప్పలనాయుడు నిలదీత
- ల్యాండ్‌ఫిల్‌ను ఏర్పాటు చేయడానికి వీల్లేదు: సీపీఎం నేత లోకనాథం డిమాండ్
- నాయకులతో కలిసి సభను బహిష్కరించిన తాడి గ్రామస్థులు

ముక్తకంఠంతో తేల్చి చెప్పిన తాడి గ్రామస్థులు



ల్యాండ్‌ఫిల్ ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న తాడి గ్రామస్థులు



మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

పరవాడ, జనవరి 30: **ఫార్మా అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దని తాడి గ్రామస్థులు స్పష్టం చేశారు. ఫార్మా కాలుష్యంతో ఇప్పటికే నరకయాతన అనుభవిస్తున్నామని, ఇది చాలక మరో కాలుష్య కుంపటిని తమ నెత్తి మీద పెట్టొద్దని వేడుకున్నారు.**

తాడి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 116లో రీ-సస్టెయినబుల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఫార్మా అదనపు ల్యాండ్‌ఫిల్ కోసం తహసీల్దార్ కార్యాలయం పక్కన మంగళవారం జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సభను సుమారు గంట ఆలస్యంగా ప్రారంభించారు. జేసీ జాహ్నవి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరి అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. తొలుత జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా తాడి గ్రామస్థులు ఫార్మా కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని చెప్పారు. తమ గ్రామాన్ని తరలించాలని ఏళ్ల తరబడి ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఫార్మా కాలష్యం కారణంగా భూగర్భజలాలు కలుషితమయ్యాని, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా కాలుష్యంపై ఎన్‌జీటీలో కేసు నడుస్తున్నదని, ఈ క్రమంలోఅదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయసేకరణ చేపట్టడం చట్టరీత్యా నేరమన్నారు. ల్యాండ్ ఫిల్ ఏర్పాటుకు తమ పార్టీ పూర్తి వ్యతిరేకమని ఆయన స్పష్టం చేశారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ, చుట్టుపక్కల వున్న ఇ.బోనంగి, పరవాడ, తానాం, సాలాపువానిపాలెం గ్రామాల ప్రజలకు సమాచారం ఇవ్వకుండా ప్రజాభిప్రాయసేకరణ ఎలా జరుపుతారని పీసీబీ అధికారులను నిలదీశారు. ఫార్మా కాలుష్యంతో నిర్వాసిత గ్రామాల ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాభిప్రాయసేకరణ సభకు స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోను ల్యాండ్ ఫిల్ ఏర్పాటుకు తాము ఒప్పుకోబోమని స్పష్టం చేశారు.

సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ, ఫార్మా ... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న పంచకర్ల రమేశ్ బాబు, బండారు అప్పలనాయుడు, కె.లోకనాథం

ఆర్టీసీ స్థలం లీజుపై రగడ

సర్వేను అడ్డుకున్న పంచాయతీ వార్డు సభ్యులు, సీపీఐ, జనసేన నాయకులు

- చెరువుతో సహా మొత్తం సర్వే చేయాలని డిమాండ్
- ఆర్టీసీ స్థలం లీజుదారులకు, పంచాయతీ వార్డు సభ్యులకు మధ్య తోపులాట
- సర్వేకు సమయం కావాలన్న తహసీల్దార్



గొడవ పడుతున్న ఆర్టీసీ స్థలం లీజుదారులు, పంచాయతీ వార్డు సభ్యులు

చోడవరం, జనవరి 30: **పట్టణంలో ఆర్టీసీ స్థలం లీజు వ్యవహారంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆర్టీసీ, రెవెన్యూ, పంచాయతీ అధికారుల సమక్షంలో చేపట్టిన సర్వే కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. ఆర్టీసీ స్థలం లీజుదారులు, పంచాయతీ వార్డు సభ్యుల మధ్య గొడవ జరిగింది. ఇదే సమయంలో ఆర్టీసీ, రెవెన్యూ అధికారులను సీపీఐ, జనసేన నాయకులు, పంచాయతీ వార్డు సభ్యులు అడ్డుకున్నారు. ఆర్టీసీ స్థలంతోపాటు మొత్తం చెరువు స్థలాన్ని సర్వే చేయాలని పట్టుబట్టారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.**

చోడవరంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చెందిన 3 ఎకరాల 71 సెంట్ల స్థలంలో ఒక ఎకరా 71 సెంట్లను పీటీడీ అధికారులు ఇటీవల నెలకు లక్షా 56 వేల రూపాయల అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చిన సంగతి తెలిసిందే. లీజుదారులు ఆ స్థలంలో గ్రావెల్ వేసి అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే ఆర్టీసీ కాంప్లెక్స్‌కు దిగువన ఉన్న చెరువు స్థలంతోపాటు, పంచాయతీ, దేవదాయ శాఖల స్థలాలను కూడా లీజుదారులు కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తూ జనసేన, సీపీఐ నాయకులు ఇటీవల ఆందోళనలు చేపట్టారు. లీజు రద్దు చేయాలని, ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అంతేకాక ఆర్టీసీ స్థలంలో వాణిజ్య సముదాయాల నిర్మాణం వల్ల దిగువన ఉన్న చెరువు పరిధిలోని ఆయకట్టు రైతులకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఆర్టీసీ స్థలం లీజును వ్యతిరేకిస్తున్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు, లీజుదారులు చదును చేసిన స్థలంలో పంచాయతీ స్థలం కూడా ఉందంటూ సిమెంట్ స్తంభాలు వేసి ఫెన్సింగ్ వేశారు. దీంతో తమకు చెందిన 3 ఎకరాల 71 సెంట్ల స్థలాన్ని సర్వే చేసి అప్పగించాలని ఆర్టీసీ అధికారులు రెవెన్యూ అధికారులను కోరారు. మంగళవారం ... మిగతా 8వ పేజీలో



ఆర్టీసీ, రెవెన్యూ అధికారులను నిలదీస్తున్న సీపీఐ, జనసేన నాయకులు, పంచాయతీ వార్డు సభ్యులు

తహసీల్దార్ల బదిలీలపై కసరత్తు

» ఏడాది లోపు ఉద్యోగ విరమణ చేయనున్న వారికి మినహాయింపు

అనకాపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో ఎన్నికలు జరగనుండడంతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో రెవెన్యూ శాఖలో అధికారుల బదిలీలకు కసరత్తు మొదలైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో మూడేళ్ల నుంచి పనిచేస్తున్న వారు, ఇదే జిల్లాకు చెందిన వారిని జోన్‌లోని వేరే జిల్లాలకు బదిలీ చేయాలి. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు (విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు) తమ పరిధిలోని తహసీల్దార్ల బదిలీలకు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. అయితే ఎన్నికల సంఘం నిబంధన ప్రకారం ఏడాదిలోపు పదవీ విరమణ చేయనున్న తహసీల్దార్లకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏడాదిలోగా పదవీ విరమణ కానున్న తహసీల్దార్ల పేర్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఏఎస్ఆర్ జిల్లా హుకుంపేట తహసీల్దారు బి.రాజ్యలక్ష్మి, జి.మాడుగుల తహసీల్దారు వీవీవీ గోపాలకృష్ణ, విశాఖపట్నం జిల్లా ములగాడ తహసీల్దారు డీటీ వీరభద్రరావు, అనకాపల్లి జిల్లా సబ్బవరం తహసీల్దారు బి.సత్యనారాయణ, మునగపాక తహసీల్దారు వి.ప్రకాశరావు, అనకాపల్లి తహసీల్దారు పీవీఎల్ఎన్ గంగాధరరావు, పరవాడ తహసీల్దారు పి.కనకారవు, గొలుగొండ తహసీల్దారు వైఎస్‌వీవీ ప్రసాదరావుల పేర్లు ఈ జాబితాలో వున్నాయి. బదిలీల నుంచి వీరికి మినహాయింపు ఇవ్వనున్నారు. ఇంకా అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం ఏవో చంద్రశేఖరరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎం.ఎ.శ్రీనివాస్‌లకు కూడా మినహాయింపు వుంది.

విశాఖ చేరిన భారత్, ఇంగ్లండ్ జట్లు

పీఎంపాలెంలోని ఏసీఏ- వీడీసీఏ స్టేడియంలో ఫిబ్రవరి 2 నుంచి జరగనున్న టెస్టు మ్యాచ్ కోసం భారత్, ఇంగ్లండ్ జట్ల ఆటగాళ్లు మంగళవారం విశాఖపట్నం చేరుకున్నారు. వీరి రాకతో పండుగ వాతావరణం నెలకొంది. వీరంతా హోటల్ నోవాటెల్‌లో బస చేశారు. బుధ, గురువారం ఇరుజట్ల ఆటగాళ్లు నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి


భారత ఆటగాళ్లు ముఖేష్‌కుమార్, మహ్మద్ సిరాజ్


యశస్వి జైస్వాల్, జస్ప్రీత్ బుమ్రా


శ్రేయాస్ అయ్యర్


అశ్విన్, శుభంగిల్


కేఎస్ భరత్


ఇంగ్లండ్ ఆటగాళ్లు

క్రైం... crime news

వృద్ధురాలిపై హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జనవరి 30: పట్టణంలో ఒంటరిగా ఇంట్లో ఉన్న వృద్ధురాలిపై హత్యాయత్నం చేసి బంగారం దోచుకువెళ్లిన ఘటనలో నిందితుడిని మంగళవారం పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. పట్టణంలోని ఓ ఇంట్లో కర్రి లక్ష్మీనారాయణమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసముంటున్నారు. ఆమె కుమార్తె నాగ చంద్రిక, అల్లుడు కాండ్రేగుల మురళి ఈ నెల 26వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో లక్ష్మీనారాయణమ్మను చూసేందుకు వచ్చారు. ఆమె స్పృహ తప్పి ఉండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరుడు కిశోర్‌కుమార్‌కు చంద్రిక చెప్పింది. ఆరోగ్యంగా ఉంటున్న తన తల్లికి ఇంతలో ఏమైందని అనుమానం వచ్చి కిశోర్‌కుమార్ తన సెల్‌ఫోన్‌కు కనెక్ట్ అయి ఉన్న సీసీ కెమెరాను చూశారు. తన తల్లి ఇంటి సమీపంలో ఉంటున్న సిటీ కేబుల్ టెక్నీషియన్ మళ్ల గోవింద్ ఈ నెల 26న ఇంట్లోకి ప్రవేశించి తువ్వాలుతో తన తల్లి మెడను బిగించి ఆమె మృతి చెందిందని భావించి బంగారంతో పరారైనట్టు గుర్తించారు. జరిగిన విషయాన్ని పట్టణ పోలీసులకు కిశోర్‌కుమార్ ఫిర్యాదు చేయగా, పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితుడు మళ్ల గోవింద్‌ను అనకాపల్లి పట్టణంలో మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నందుకు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4.1 లక్షలు సీజ్

సబ్బవరం, జనవరి 30: ఎటువంటి పత్రాలు లేకుండా కారులో తరలిస్తున్న రూ.4.1 లక్షల నగదును సబ్బవరం పోలీసులు సీజ్ చేసి, ఇద్దరిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ పి.రమణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారి మర్రిపాలెం చెక్‌పోస్టు వద్ద సోమవారం రాత్రి సీఐ పి.రమణ, ఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయనగరం నుంచి రామచంద్రపురం వెళుతున్న కారును ఆపి తనిఖీ చేశారు. కారులో ఉన్న రూ.4.1 లక్షల నగదును పట్టుకొని అందులో ఉన్న ఇద్దరిని ప్రశ్నించారు. ఆ నగదుకు సంబంధించి ఎటువంటి రసీదులు, పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశామని సీఐ తెలిపారు. కారులో ఉన్న తూర్పుగోదావరి జిల్లా కాకినాడ దరి కొవ్వూరుకు చెందిన పడాల సత్యనారా యణ(60), రామచంద్రాపురానికి చెందిన పడాల సాయిబాబా(56)ను అరెస్టు చేసి మండల మేజిస్ట్రేట్ కోర్టుకు మంగళవారం కేసును బదిలీ చేసినట్టు తెలిపారు. సోమవారం వారిద్దరూ రామచంద్రాపురం నుంచి విజయనగరంలో జరిగిన ఒక వేలంలో పాల్గొనేందుకు వెళ్లి తిరిగి వస్తున్నట్టు తమ విచారణలో చెప్పారన్నారు. నగదుకు సంబంధించిన పత్రాలు చూపిస్తే మండల మేజిస్ట్రేట్ నగదును ఇస్తారన్నారు. లేకుంటే ట్రెజరీకి జమచేస్తారని సీఐ తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వలంటీర్ మృతి

మునగపాక, జనవరి 30: మండలంలోని రామగిరి గ్రామంలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ పైనుంచి పడి వలంటీర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వలంటీర్ వాయిబోయిన అప్పలరాజు(33) మంగళవారం గ్రామానికి వస్తున్న ఒక ట్రాక్టర్‌లో కూర్చున్నాడు. ప్రమాదవశాత్తూ పైనుంచి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతనిని అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

48 మద్యం బాటిళ్లు స్వాధీనం

సబ్బవరం, జనవరి 30: మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో మంగళవారం పోలీసులు దాడులు చేసి 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... సీఐ పిన్నింటి రమణ ఆదేశాల మేరకు సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. మలునాయుడుపాలేనికి చెందిన బైలపూడి బంగారయ్య 48 మద్యం బాటిళ్లను గోనె సంచిలో పెట్టి నడుచుకుంటూ మలునాయుడుపాలెం వెళుతుండగా గుల్లేపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతనిని అరెస్టు చేసి అనకాపల్లి సబ్ జైలుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

తానాంలో ఎనిమిది మద్యం సీసాలు..

పరవాడ: మండలంలోని తానాం గ్రామంలో గల ఓ పాన్‌షాపులో ఎనిమిది మద్యం సీసాలను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. పాన్‌షాపులో మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్టు చెప్పారు. ఈ దాడిలో ఎనిమిది క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని షాపు యజమాని దుంగల నాయుడుబాబుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

కారులో ఆరు మద్యం బాటిళ్లు

సబ్బవరం: ఒడిశా నుంచి మద్యం బాటిళ్లతో కారులో వస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ రమణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జాతీయ రహదారి మర్రిపాలెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా అటుగా కారు వచ్చింది. దాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో ఆరు మద్యం బాటిళ్లు ఉన్నాయి. ఆ బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒడిశా రాష్ట్రంలోని జగత్సింగ హాపూర్ మండలానికి చెందిన తుషార్ రంజన్ మిశ్రాను అరెస్టు చేశారు. అతను ప్రస్తుతం ప్రకాశం జిల్లా సింగరాయిలో నివాసముంటున్నాడు. స్వగ్రామం నుంచి సింగరాయికి కారులో మద్యం బాటిళ్లతో వెళుతుండగా పట్టుబడ్డాడు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం

అనకాపల్లి టౌన్, జనవరి 30: స్థానిక రింగురోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అధ్యక్షతన జిల్లా నూతన కార్యవర్గం ఎంపికైంది. జిల్లా గౌరవాధ్యక్షుడిగా బుద్ద భూలోకనాయుడు, అధ్యక్షుడిగా కొణతాల చంద్రరావు, ఉపాధ్యక్షుడిగా పిట్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా కె.రాజు, కోశాధికారిగా శివ, మహిళా కో-ఆర్డినేటర్‌గా బుద్ద చంద్ర, సభ్యులుగా మళ్ల ప్రసాద్, ఆకుల నానాజీ, కర్రి సుబ్రహ్మణ్యం, దాడి బుజ్జి, కర్రి మహలక్ష్మినాయుడులు ఎన్నికయ్యారు. వీరిని బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర సత్కరించి సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

80 ఎకరాలకు మంత్రి టెండర్

- అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద ఆరోపణ
- 1970లో పట్టాలు పొందిన వారిని పక్కనపెట్టి కొత్త వారిని తెరపైకి తెచ్చారు
- విలువ రూ.800 కోట్లు
- ల్యాండ్ పూలింగ్‌లోనూ అక్రమాలు
- సమీకరించిన 1200 ఎకరాల్లో 400 ఎకరాలు గుడివాడ అమర్‌నాథ్ బినామీలదే
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ. చిత్రంలో అయ్యన్నపాత్రుడు, గండి బాబ్జీ

విశాఖపట్నం, జనవరి 30: అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల సమీపంలో 80 ఎకరాల డీఫారం భూములు కొట్టేసేందుకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ యత్నిస్తున్నారని అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. మంగళవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఎంఏఎల్ కళాశాలను ఆనుకుని ఉన్న భూములకు 1970లో అప్పటి ప్రభుత్వం పిసినికాడ గ్రామస్థులకు డీ.ఫారం పట్టాలు మంజూరు చేసిందన్నారు. అయితే ఆ భూమి అనకాపల్లి పట్టణానికి ఆనుకుని ఉండడంతో ఇప్పుడు దాని విలువ రూ.కోట్లలోకి చేరిందన్నారు. ఇటీవల ప్రభుత్వం డీఫారం పట్టా భూములను రైతులకు రిజిస్ట్రేషన్ చేయాలని జీవో ఇచ్చిన నేపథ్యంలో మంత్రి అమర్‌నాథ్ ఆ 80 ఎకరాలపై కన్నేశారన్నారు. గతంలో డీ.పట్టాలు పొందిన వారి పేర్లు రికార్డుల్లో మార్చేసి కొత్త వ్యక్తుల పేర పట్టాలు సృష్టించారని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. ఇప్పుడు ఆ నకిలీ వ్యక్తుల పేరన భూములు క్రమబద్ధీకరణకు మంత్రి యత్నిస్తున్నారని, అందుకు జిల్లా కలెక్టర్ కూడా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని 80 ఎకరాలు 1970లో పట్టాలిచ్చిన రైతులకే చెందేలా ఆదేశాలివ్వాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ భూముల విలువ రూ.800 కోట్లు ఉంటుందన్నారు.

అలాగే గూడు లేని పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం అనకాపల్లి పరిసరాల్లో 1200 ఎకరాలు ప్రభుత్వం తీసుకుంటే...అందులో 400 ఎకరాలు మంత్రి బినామీలదేనన్నారు. ల్యాండ్ పూలింగ్ జరగనుందని ముందుగా తెలుసుకొని పేద ఎస్సీ, ఎస్టీ రైతులను బెదిరించి తక్కువ రేటుకు భూములు కాజేసి పూలింగ్‌కు ఇచ్చేశారన్నారు. ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోలేదన్నారు. మంత్రి చేతిలో అనకాపల్లి కలెక్టర్ కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అక్రమాలపై సీఐడీకి ఫిర్యాదు చేశానన్నారు. దీని వెనుక ఆర్డీఓ, మరికొంతమంది రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. అయితే మంత్రి ఒత్తిడితో అన్ని శాఖలు విచారణ తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆరోపించారు. కశింకోట మండలం విస్సన్నపేటలో 600 ఎకరాల భూకుంభకోణంపై విచారణ జరిపిన అధికారులు...ఇప్పటికీ నివేదిక బయటపెట్టలేదని పేర్కొన్నారు. అనకాపల్లి మండలంలో ల్యాండ్ పూలింగ్‌లో చోటుచేసుకున్న అక్రమాలపై రెండేళ్ల నుంచి తాను ఫిర్యాదు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వీటన్నింటిపై సీనియర్ అధికారితో విచారణ జరపాలని గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు గండి బాబ్జీ, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, పార్టీ నేతలు పీలా శ్రీనివాస్, బొత్సా విజయ్‌కుమార్, మళ్ళ సురేంద్ర పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్‌లో మందకొడిగా క్రషింగ్

- బాయిలర్ హౌస్‌లో సాంకేతిక లోపం వల్ల రెండు సార్లు అంతరాయం
- యార్డులో భారీగా నిలిచిపోయిన చెరకు బళ్లు


గోవాడ యార్డులో నిలిచిన చెరకు బళ్లు

చోడవరం, జనవరి 30: గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో సాంకేతిక సమస్యల కారణంగా రెండు సార్లు క్రషింగ్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో మందకొడిగా క్రషింగ్ సాగుతోంది. బాయిలింగ్ హౌస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా సోమవారం రాత్రి క్రషింగ్ నిలిపివేసి మరమ్మతులు చేపట్టారు. దీంతో క్రషింగ్ నిలిచిపోయింది. మరమ్మతులు చేపట్టి తిరిగి మంగళవారం తెల్లవారుజామున క్రషింగ్ ప్రారంభించిన కొద్దిసేపటికే మరోసారి అంతరాయం ఏర్పడింది. మళ్లీ మరమ్మతులు చేసి మధ్యాహ్నం క్రషింగ్ ప్రారంభించారు. కాగా గోవాడలో క్రషింగ్ ఆలస్యంగా సాగుతుండడంతో యార్డులో చెరకు బళ్లు భారీగా నిలిచిపోయాయి. ఇదే సమయంలో కాటాల వద్ద కూడా చెరకు ఎక్కువ రోజులు నిల్వ ఉండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్మార్ట్ సిటీ పనుల అడ్డగింతకు సన్నద్ధం

- నేటి నుంచి ఆందోళనలు కొనసాగించాలని రైతుల నిర్ణయం


స్మార్ట్ సిటీకి కేటాయించిన స్థలంలో రోడ్డు పనులు

అచ్యుతాపురం, జనవరి 30:

అచ్యుతాపురం - గాజువాక ప్రధాన రహదారిలో ఏర్పాటు చేయబోయే స్మార్ట్‌సిటీ పనులను అడ్డుకునేందుకు కొందరు రైతులు సన్నద్ధమవుతున్నారు. బుధవారం నుంచి ఆందోళనలు కొనసాగించాలని వారు నిర్ణయించుకున్నారు. ఉమ్మడి చోడపల్లి పంచాయతీతో పాటు భోగాపురం పంచాయతీ రెవెన్యూలో గల సుమారు 66 ఎకరాల ప్రభుత్వ భూమికి దశాబ్దాల క్రితం రామన్నపాలెం, అప్పన్నపాలెం, భోగాపురంలో గల నిరుపేద రైతులకు పట్టాలిచ్చారు. అప్పటి నుంచి వీరు వాటిని సాగుచేసుకుంటూ జీవిస్తున్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో స్మార్ట్ సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచించింది. దీంతో వైసీపీ నాయకులు పావులు కదిపి రైతులు సాగుచేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వ భూమి కనుక ఇక్కడ స్మార్ట్ సిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఈ ప్రభుత్వ భూమి చుట్టుపక్కల వైసీపీ నాయకులకు చెందిన రియల్ ఎస్టేట్ భూములు ఉండడమే దీనికి కారణం. అయితే గాజువాక - అచ్యుతాపురం ప్రధాన రహదారి నుంచి వైసీపీ నాయకుల భూములకు ప్రధాన రహదారి లేదు. స్మార్ట్ సిటీ అభివృద్ధి చేస్తే తమ భూములకు రహదారులు ఏర్పడతాయని భావించి ఈ ఎత్తువేశారు. ఇప్పటికే గాజువాక - అచ్యుతాపురం ప్రధాన రహదారి నుంచి స్మార్ట్ సిటీకంటూ 40 అడుగుల రోడ్లకు మార్కింగ్‌లు కూడా చేసేశారు. 2023 కన్నా ముందు డి పట్టాలు పొందిన ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరణ చేయవచ్చంటూ జగన్ ప్రభుత్వం చట్టం తెచ్చింది. దీంతో ఇక్కడ ఎకరా ధర రూ.4 కోట్లకు పెరిగింది. దీంతో ఇక్కడ ఒక వైసీపీ నాయకుడు రైతులను బెదిరించి సుమారు 4.70 ఎకరాల భూమిని అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. మారిన చట్టం ప్రకారం అధికారికంగా రిజిస్ట్రేషన్ చేసుకొని ప్రస్తుతం లేఅవుట్‌గా మార్చి విక్రయాలు ప్రారంభించారు. అయితే రైతులు కూడా ఇదే విధంగా జిరాయితీలుగా మార్చుకోవాలని ప్రయత్నించారు. కానీ మిగిలిన భూమి స్మార్ట్ సిటీకి కేటాయిస్తున్నామని, అందువల్ల రిజిస్ట్రేషన్లు జరగవని అధికారులు ప్రకటించటంతో ఆర్థిక స్థోమత ఉన్న రైతులు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. ప్రస్తుతం అధికారులు స్టే తెచ్చుకున్న రైతుల భూములను మినహాయించి మిగిలిన భూములను అధికారులు చదును చేస్తున్నారు. రైతులు అడ్డుకోవడంతో పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. కాగా రైతుల అంగీకారంతోనే స్మార్ట్‌సిటీ పనులు ప్రారంభించామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. కొంతమంది కోర్టును ఆశ్రయించారని, వారి భూములను వదిలి మిగతావి చదును చేస్తున్నామన్నారు. ఎన్నికల విధుల కారణంగా పనులు ఆలస్యమయ్యాయని ఆయన తెలిపారు.

ఎన్నికల విధులను అంకితభావంతో నిర్వహించాలి

- ఎస్పీ కేవీ మురళీకృష్ణ


డైరీని ఆవిష్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 30 : ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఎన్నికల్లో తమకు కేటాయించిన విధులను సిబ్బంది అంకితభావంతో నిర్వహించాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీసులకు రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక రింగురోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎన్నికల శిక్షణ పొందిన అధికారులు, జిల్లా పోలీసులకు, సెక్టార్ పోలీసులకు శిక్షణ ఇచ్చారు. ఎన్నికల విధి విధానాలు, నియమ నిబంధనలు, సంబంధిత చట్టాలు తదితర అంశాలపై పోలీస్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని వారికి సూచించారు. ఎన్నికల విధి విధానాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను ఎస్పీ స్వయంగా వివరించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగిసే వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ముద్రించిన పోలీస్ డైరీని ఎస్పీ ఆవిష్కరించి అధికారులకు, అసోసియేషన్ సభ్యులకు అందజేశారు. ఈ సమావేశంలో నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా, అదనపు ఎస్పీలు బి.వి జయభాస్కర్, పి.సత్యనారాయణరావు, డీఎస్పీలు వి.సుబ్బరాజు, కేవీ సత్యనారాయణ, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిఘా ముమ్మరం చేయాలి

అనకాపల్లి రూరల్: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నిఘాను ముమ్మరం చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్టు కేసులు, 174 సీఆర్‌పీసీ కేసులు, గంజాయి కేసులలు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉండడానికి కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది అధికారులు, సిబ్బందికి ఆయన ప్రశంసాపత్రాలు ఇచ్చి సత్కరించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణ రావు, నర్సీపట్నం సబ్‌డివిజన్ అధికారి అదిరాజ్‌సింగ్‌రాణా, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలిండియా పోలీస్ కమాండో పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఏపీ


చాంపియన్‌గా నిలిచిన ఆంధ్ర జట్టుకు ట్రోఫీ బహూకరిస్తున్న ఇంటెలిజెన్స్ బ్యూరో అదనపు డైరెక్టర్ మహేష్‌దీక్షిత్

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 14వ ఆలిండియా పోలీస్ కమాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. విశాఖలోని గ్రేహౌండ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో ఈనెల 22న ప్రారంభమైన పోటీలు మంగళవారం ముగిశాయి. ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు పర్యవేక్షణలో పది ట్రోఫీల కోసం దేశవ్యాప్తంగా ఉన్న 23 జట్లు పోటీపడ్డాయి. ఏఓబీ/ఛత్తీస్‌ఘడ్ సరిహద్దు నక్సల్స్ ప్రభావిత దట్టమైన అడవుల్లో గెరిల్లా యుద్ధవ్యూహాలు, నైపుణ్యంలో ఏపీ గ్రేహౌండ్స్ కమాండోల జట్టు ప్రథమ స్థానం దక్కించుకుంది. దీంతోపాటు మొత్తం పదింటిలో ఐదు ట్రోఫీలు, బెస్ట్ స్టేట్ పోలీస్ కమాండో టీమ్, చక్రవ్యూహం-1 రూల్, బెస్ట్ బ్లాక్‌హాక్‌ఫైరింగ్, టీమ్ ఇన్ కాన్ఫిడెన్స్ విభాగాల్లో విజేతగా నిలిచి ఏపీ ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో రాజస్థాన్ దక్కించుకున్నాయి. విజేతలకు ఇంటెలిజెన్స్ బ్యూరో అదనపు డైరెక్టర్ మహేష్‌దీక్షిత్, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్‌అయ్యన్నార్, గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ ఆర్కే మీనా, గ్రేహౌండ్స్ డీఐజీ కోయ ప్రవీణ్, తదితరులు బహుమతులు అందజేశారు.

11న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

ఎలమంచిలి, జనవరి 30: ప్రముఖ గాయకుడు ఘంటసాల వర్థంతిని పురస్కరించుకుని ఈ నెల 11న రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడారి పూరిజగన్నాథం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలమంచిలి ఘంటసాల కళామందిర్‌లో ఘంటసాల వర్థంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా పాటల పోటీలను సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. విజేతలకు నగదుతో పాటు సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి స్థానిక కళాకారులతో ఘంటసాల సినీ సంగీత విభావరి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9390877174, 9866307171 ఫోన్ నంబర్లను సంప్రతించాలని కోరారు.

హాకీ జిల్లా జట్ల ఎంపిక రేపు

ఎలమంచిలి, జనవరి 30: ఎలమంచిలి రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో ఫిబ్రవరి 1వ తేదీన జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల హాకీ జిల్లా జట్ల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని హాకీ జిల్లా చైర్మన్ ఆడారి వీరునాయుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక హాకీ అసోసియేషన్ ప్రతినిధి కొఠారు నరేశ్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జూనియర్(బాలికల)విభాగంలో పాల్గొనేందుకు 2005 సంవత్సరంలో పుట్టిన వారు, సబ్ జూనియర్(బాలురు)విభాగంలో పాల్గొనేందుకు 2008 నుంచి పుట్టిన వారు అర్హులని తెలిపారు. ఈ జట్ల ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని కోరారు.

జిల్లా రగ్బీ జట్టు ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన జిల్లా రగ్బీ జట్టు

అచ్యుతాపురం, జనవరి 30: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అనకాపల్లి జిల్లా సబ్‌జూనియర్ రగ్బీ జట్టు ఎంపిక మంగళవారం స్థానిక మండల కాంప్లెక్స్ గ్రౌండ్‌లో జరిగింది. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన 24 మంది బాల, బాలికలను జిల్లా కోచ్ వెంకట్ ఎంపిక చేశారు. ఫిబ్రవరి మూడు, నాలుగు తేదీల్లో విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటాయి. ఈ కార్యక్రమంలో కూండ్రపు వెంకునాయుడు, కోన బుజ్జి, రెడ్డి గణేశ్, వెంకట్, సుధీర్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని సెర్ప్ ఉద్యోగుల ఆందోళన


కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లి టౌన్, జనవరి 30: పట్టణంలో సెర్ప్ ఉద్యోగులు మంగళవారం వినూత్న రీతిలో ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాదయాత్ర సమయంలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రభుత్వం ఇప్పటికే సెర్ప్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించిందని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ డిమాండ్లను అమలు చేయాలని సెర్ప్ జేఏసీ ప్రతినిధి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ జేఏసీ ప్రతినిధులు వాసు, గోవిందమ్మ, శ్రీనివాస్, రమణ, సత్యవతిలు పాల్గొన్నారు. సెర్ప్ ఉద్యోగుల ఆందోళన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సందర్శించి సంఘీభావం తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సెర్ప్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా పీలా పేర్కొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రోగులకు ఉచితంగా మందులు


డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కుమార్

నర్సీపట్నం, జనవరి 30: ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు వైద్య నిపుణులు రాసిన మందులు ప్రభుత్వాస్పత్రుల్లో దొరక్కపోతే ఎంత ఖరీదైనా కొనుగోలు చేసి ఇస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన అర్బన్ పీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 1.9 లక్షల మంది వైద్య సేవలు పొందినట్టు తెలిపారు. రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇప్పటికి 35 వేల మంది లబ్ధి పొందారని తెలిపారు. కంటి సమస్యలతో ఉన్న వారిని గుర్తించి 900 కంటి ఆపరేషన్లు చేయించామని, 17 వేల మందికి కంటి అద్దాలు అమర్చామన్నారు. ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు 5.12 లక్షల మంది ఉండగా, 4.76 లక్షల కార్డులు వచ్చాయని, వాటిలో 2.6 లక్షల మందికి వలంటీర్ల ద్వారా పంపిణీ చేశామని తెలిపారు.

షేర్ మార్కెట్ పేరిట మోసం

ఎలమంచిలి, జనవరి 30: షేర్ మార్కెట్‌లో నగదు పెట్టడం వల్ల తక్కువ కాలంలో ఎక్కువ మొత్తం వస్తుందని తన బంధువు నమ్మించడంతో సుమారు కోటి రూపాయలు వరకు మోసపోయానని బాధితుడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్ఐ పాపినాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఎలమంచిలి ధర్మవరానికి చెందిన వీసం రామకృష్ణ తన బంధువైన అచ్యుతాపురానికి సాయి శ్యామ్‌కు షేర్ మార్కెట్‌లో డబ్బులు పెడతానంటే దఫదఫాలుగా సుమారు కోటి రూపాయల వరకు ఇచ్చాడు. అయితే తన డబ్బులు అడుగుతుంటే ఇవ్వకపోవడంతో సాయి శ్యామ్‌పై రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తప్పుల కుప్పలు!

... 5వ పేజీ తరువాయి

అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా తుది జాబితాలను తయారు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముసాయిదా జాబితాల్లో డబుల్ ఎంట్రీలు (ఒక వ్యక్తికి రెండుచోట్ల ఓట్లు), చనిపోయిన, వలస పోయిన వారి పేర్లు వుండడాన్ని గతంలోనే అధికారుల దృష్టికి తీసుకువచ్చినా, ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, యథావిధిగా తప్పుల తడకలతో జాబితాలను విడుదల చేశారని అంటున్నారు. అదే విధంగా ఒకే ఇంటి నంబరుపై పదుల సంఖ్యలో ఓట్లు నమోదు వంటి తప్పిదాలను కూడా సరి చేయలేదని విపక్షాల నాయకులు ఆరోపిస్తున్నారు.

జాబితాల్లో చనిపోయిన వారు పేర్లు!

అనకాపల్లి నియోజకవర్గంలో (జీవీఎంసీ పరిధి) పోలింగ్ బూత్ 234లో వరుస సంఖ్య 3లో వున్న వీరాల జగ్గారావు, 220వ బూత్‌లో వరుస సంఖ్య 93లో మైపాలి ఉదయలక్ష్మి, వరుస సంఖ్య 147లో వేల్పుల రాము, వరుస సంఖ్య 150లో వేల్పుల భూలక్ష్మి, వరుస సంఖ్య 348లో దూలం నాగభూషణమ్మ, వరుస సంఖ్య 487లో భీశెట్టి భావన, వరుస సంఖ్య 699లో మద్దాల కేదారి మృతిచెందినప్పటికీ వారు పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. పోలింగ్ బూత్ 220 వరుస సంఖ్య 101లో కాండ్రేగుల తవుడుబాబు, వరుస సంఖ్య 118లో దాడి బలరామ్, వరుస సంఖ్య 1,085లో కొణతాల భూలోకమ్మ, వరుస సంఖ్య 1,103లో కొణతాల వరహా వెంకట నూకరాజు చనిపోయినప్పటికీ వీరి పేర్లు జాబితాలో ఉన్నాయి. వీరిలో కొంతమంది చనిపోయి రెండు, మూడేళ్లు అవుతున్నదని, అయినప్పటికీ ఓటరు జాబితాల్లో నుంచి తొలగించకపోవడంతో బీఎల్‌వోల పనితీరుకు అద్దం పుడుతున్నదని విపక్ష నేతలు ఎద్దేవా చేస్తున్నారు. కాగా 219వ పోలింగ్ బూత్ పరిధిలో నివాసం వుంటున్న వారిలో కొంతమందికి పోలింగ్ బూత్ 216లో ఓట్లు వున్నాయి.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

జిల్లా ఎన్నికల అధికారులు ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాల్లోనూ తప్పులు కొనసాగాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిల పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తుది ఓటర్ల జాబితాల్లో తప్పులను గుర్తించే కార్యక్రమం కొనసాగుతున్నది. ముసాయిదా జాబితాల్లో దొర్లిన తప్పిదాలపై ఫిర్యాదులు చేసినా.. ఎన్నికల అధికారులు పట్టించుకోలేదు. అధికార పార్టీకి మేలు చేకూర్చేలా తుది ఓటర్ల జాబితాలను విడుదల చేశారు. వీటిపై ఎన్నికల కమిషన్‌ను ఫిర్యాదు చేస్తాం. జాబితాల్లో లోపాలను సవరించేందుకు మళ్లీ అర్జీలు స్వీకరించడమే కాకుండా రాజకీయ పార్టీలు అందజేసే నివేదికలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తాం.

ఆర్టీసీ స్థలంపై లీజు రగడ

... 5వ పేజీ తరువాయి

సాయంత్రం అనకాపల్లి ఆర్టీసీ డీఎం సుజాత, ఇతర అధికారులు, తహసీల్దార్ బి.తిరుమలబాబు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ ఈవో నారాయణరావు, తదితరులు ఇక్కడకు వచ్చి స్థలం సర్వేకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు వచ్చి సర్వేను అడ్డుకున్నారు. ఇదే సమయంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, జనసేన నాయకుడు జెర్రిపోతుల నానాజీ, తదితరులు తహసీల్దార్ బి.తిరుమలబాబును అడ్డుకున్నారు. ఆర్టీసీ స్థలం లీజు పేరుతో సాగునీటి చెరువుకు వర్షం నీరు వచ్చే కాలువలు, పంచాయతీ స్థలాలను కప్పివేసే అధికారం లీజుదారులకు ఎవరిచ్చారంటూ వాదనకు దిగారు. చెరువు మొత్తం 31 ఎకరాల విస్తీర్ణంలో వుందని, పూర్తిగా సర్వే చేసిన తరువాతే ఆర్టీసీ స్థలం సర్వే చేయాలని స్పష్టం చేశారు. ఆర్టీసీ స్థలం లీజుతో తమకు సంబంధం లేదని, కానీ వాస్తవంగా చెరువు విస్తీర్ణం 39 ఎకరాలు ఉందని, చెరువు స్థలాన్ని సమగ్రంగా సర్వే చేసి అందులో ఆర్టీసీ స్థలం ఏదో నిర్ధారించాలని సీపీఐ నాయకుడు రెడ్డిపల్లి అప్పలరాజు, తహసీల్దార్‌ను కోరారు.

లీజుదారులకు, పంచాయతీ సభ్యులకు మధ్య ఘర్షణ

ఆర్టీసీ స్థలం సర్వే సందర్భంగా లీజుదారులకు, పంచాయతీ వార్డు సభ్యులకు మధ్య మాటామాటా పెరగడంతో తోపులాట చేసుకుంది. ఒక దశలో పంచాయతీ వార్డు సభ్యులు... లీజుదారులపై తిరగబడడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆర్టీసీ స్థలం కప్పివేయడంతో దిగువున ఉన్న చెరువు ఆయకట్టు పరిధిలోని రైతులు నష్టపోతారని, పంచాయతీ వార్డు సభ్యుడు కందర్ప శంకర్, జనసేన నాయకుడు నానాజీ తదితరులు ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం లీజుదారులు కప్పివేసిన కాలువ, చెరువుతోపాటు, దీనికింద ఉన్న ఆయకట్టు భూములను జనసేన, సీపీఐ నాయకులు ఆర్టీసీ డీఎం సుజాతను తీసుకెళ్లి చూపించారు.

కాగా ఆర్టీసీ స్థలంతోపాటు మొత్తం చెరువు స్థలాన్ని సర్వే చేయాలని స్థానికులు, పంచాయతీ సభ్యులు, విపక్షాల నాయకులు పట్టుబడుతున్నందున ఆర్టీసీ స్థలం సర్వే చేయడానికి తమకు కొంత సమయం కావాలని తహసీల్దార్ బి.తిరుమలబాబు, ఆర్టీసీ అధికారులకు స్పష్టం చేశారు..

మారేడుపూడిలో వైసీపీ నేతల భూదాహం!

అనకాపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం మారేడుపూడిలో వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను దొడ్డిదారిన సొంతం చేసుకుంటున్నారు. గ్రామ సర్వే నంబరు 354/1లో సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ బంజరు భూమిలో వైసీపీ నేతలు పాగా వేశారు. రెండు మూడు సెంట్లను ప్లాట్లుగా విభజించి అమ్ముకుంటున్నారు. ఈ ప్రాంతంలో మార్కెట్ రేటు ప్రకారం సెంటు ధర రూ.3 లక్షలు నుంచి రూ.4 లక్షలు పలుకుతోంది. గ్రామంలో ప్రభుత్వ భూమి ప్లాట్‌లుగా విభజించి అమ్ముకుంటున్నా రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. అక్కిరెడ్డిపాలెంకు చెందిన పలువురు కొనుగోలుదారులు ప్రభుత్వ స్థలంలో షెడ్లు కూడా వేసుకున్నారు. కొంతమంది పునాదులు వేసి హద్దులు నిర్ణయించుకున్నారు. గడిచిన కొద్ది రోజులుగా మంత్రి అనుచరులుగా చెప్పుకుంటున్న కొంతమంది నేతలు భూఆక్రమణల పరంపర కొనసాగుతున్నా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టేందుకు సాహసించడం లేదు. మారేడుపూడిలో వైసీపీ నేతల భూ ఆక్రమణలు, ప్లాట్‌లుగా విభజించి అమ్ముకోవడంపై స్థానిక సర్పంచ్ సాలాపు కనకరాజు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి ఫిర్యాదు చేశారు.



మారేడుపూడిలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన షెడ్లు

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

» చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, జనవరి 30 : ఫిబ్రవరి నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందుగానే మునిసిపాలిటీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మునిసిపాలిటీలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గుర్తించిన ప్రాంతాల్లో 30 అడుగుల కన్నా తక్కువ రోడ్డు ఉన్న ఏరియాల్లో గిఫ్ట్‌డీడ్ ఇచ్చి భవన నిర్మాణ అనుమతులు పొందాలన్నారు. అనంతరం కొత్తపాలెం వార్డులో పలుచోట్ల దెబ్బతిన్న కల్వర్టులను పునరుద్ధరించాలని కౌన్సిలర్ సంతోష్ కోరారు. ఎన్టీఆర్ కాలనీతోపాటు పలు ప్రాంతాల్లో నెలకొన్న లోఓల్టేజ్ సమస్యను తీర్చాలని కౌన్సిలర్ మరిడేశ్వరావు కోరారు. గొల్లలపాలెం, మంత్రిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ ప్రాంత ప్రజలు భయపడుతున్నారని కౌన్సిలర్ అచ్యుతరావు ఆందోళన వెలిబుచ్చారు. విద్యుత్ వైర్లు వేలాడుతున్న ప్రాంతాల్లో చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ రమాకుమారి లైన్‌ఇన్‌స్పెక్టర్ దొరను ఆదేశించారు. యర్రవరం వార్డులో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ పిట్టా సత్తిబాబు కోరారు. పలు అభివృద్ధి పనులను పాలకవర్గం సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీన ఎలమంచిలిలో తులసీఘాట్ వద్ద విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు తీర్థ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ కొండలరావు, డీఈఈ వీరయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆర్రెపు గుప్తా, కౌన్సిలర్లు మజ్జి కృష్ణ, గొర్లె సంధ్య, దాసరి చిన్నమ్మలు, ప్రగడ రమణ, బీటీ, టీపీఓ శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమాకుమారి

మహాత్మాగాంధీకి ఘన నివాళులు

అనకాపల్లి టౌన్, జనవరి 30: పట్టణంలో పలుచోట్ల మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ దాడి రత్నాకర్ మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, అకాడమిక్ డీన్ ఎ. కృష్ణనాగు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.గాంధీనగరంలోని మహాత్ముని విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల సత్యనారాయణ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కశింకోటలో.. మండలంలో ఉగ్గినపాలెం పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ కలగ లక్ష్మి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వైసీపీ జిల్లా యూత్ నాయకుడు లగిశెట్టి గణేష్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ గున్నయ్యనాయుడు, చిన్ని భాస్కరరావు, గ్రంథాలయాధికారి కాండ్రేగుల జగన్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని అడ్డరోడ్డులో గాంధీజీ విగ్రహానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు పలువురుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో మహాత్మ గాంధీ విగ్రహానికి హెచ్‌ఎం వి. రమణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ మాజీ చైర్మన్ చందక రమణ, ఉపాధ్యాయులు బి శ్రీను, గారా ప్రకాష్ పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని వేంపాడులో మహాత్మగాంధీ చిత్రపటానికి టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ నేతలు అయినంపూడి అప్పలరాజు, వైబోయిన రమణ, వి.రమణ,సురేశ్ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎలమంచిలిలో.. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 32 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవతి, ఎంఈఓ మీనాక్షిల చేతులు మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

అచ్యుతాపురంలో.. మహాత్మాగాంధీ వర్ధంతిని తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పులమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మారిశెట్టి వెంకట అప్పారావు, బి. రవికుమార్, శరగడం శివబాపునాయుడు పాల్గొన్నారు.



డైట్ కళాశాలలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న రత్నాకర్

టీడీపీ శ్రేణులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ

నక్కపల్లి, జనవరి 30: మండలంలోని వేంపాడు క్లస్టర్ పరిధిలో టీడీపీ కార్యకర్తలకు మంగళవారం ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, వైబోయిన రమణ మాట్లాడుతూ.. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల గురించి, వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వేంపాడు ఉపసర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, నాయకులు సురేశ్‌రాజు, పెదపూడి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట/రూరల్‌ల్లో.. టీడీపీ మినీ మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం చేపట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పార్టీ బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం పట్టణంతోపాటు మండలంలో మంగవరం, కేశవరం గ్రామాల్లో పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథం, చిక్కాల శ్రీను, కురందాసు శివ పాల్గొన్నారు.

కోటవురట్లలో.. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బూత్ కన్వీనర్లు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. మంగళవారం మండలంలో జల్లూరులో టీడీపీ బూత్ కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పెట్ల లింగంనాయుడు, కొడవటిపూడి ఎంపీటీసీ సభ్యుడు ప్రకాష్ పాల్గొన్నారు.



పాయకరావుపేటలో టీడీపీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న నేతలు

వైభవంగా చోడమాంబికా అమ్మవారికి జలాభిషేకం

అచ్యుతాపురం, జనవరి 30: మండలంలోని చోడపల్లి చోడమాంబికా అమ్మవారి పండుగ మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారికి యోగిరాజు బాబా, ఆలయ ధర్మకర్త కర్రి నాగేశ్వరరావు చేతుల మీదుగా జలాభిషేకం నిర్వహించారు. అనంతరం రామన్నపాలెం, మోసయ్యపేట, చోడపల్లి గ్రామాల మహిళలు బిందెలతో నీళ్లు, హారతి బిళ్ల పట్టుకొని చోడమాంబికాకు జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని, హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో రామన్నపాలెం, మోసయ్యపేట సర్పంచులు ధర్మిరెడ్డి నాయుడు బాబు, పంచదార్ల పైడిరాజు, శెట్టిబలిజ సంఘం డైరెక్టర్ వడిసెల శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ పితాని చిరంజీవి, కర్రి అప్పారావు, పుర్రే శ్రీనివాస యాదవ్, కర్రి వెంకటరమణ పాల్గొన్నారు.

జంతు సంపదను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలి

కశింకోట, జనవరి 30 : జంతు సంపదను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని నర్సింగబిల్లి పశువైద్యాధికారిణి డాక్టర్ చైతన్యమణి పిలుపునిచ్చారు. జంతు సంక్షేమ సామాజిక బాధ్యత పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం నర్సింగబిల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థులకు జంతువులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు గ్రామ సర్పంచ్ కోన అరుణ బహుమతులు అందజేశారు.

రెండు గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలు

కోటవురట్ల, జనవరి 30: మండలంలోని గొట్టివాడ, అన్నవరం గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ సామాజిక ఆడిట్ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. అన్నవరంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలకు అందిన వేతనాలు, చేసిన పనిదినాలను అడిగి తెలుసుకున్నారు. గొట్టివాడలో పనుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఉపాధి గ్రామసభ నిర్వహించి, సోషల్‌ఆడిట్ బృందం తనిఖీ చేసిన నివేదిక ఆమోదం పొందారు.

ఘనంగా బొడ్డేడ ప్రసాద్ జన్మదిన వేడుకలు

అనకాపల్లి టౌన్, జనవరి 30: వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంగళవారం మునగపాకలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో బొడ్డేడ ప్రసాద్‌తోపాటు 60 మంది రక్తదానం చేశారు. అలాగే దుప్పట్లు, వస్త్రాలు ప్రసాద్ పంపిణీ చేశారు. ప్రసాద్‌ను జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బొడ్డేడ ప్రసాద్

'పేట'లో టీడీపీ ఇంటింటా ప్రచారం

పాయకరావుపేట, జనవరి 30 : పట్టణంలో భవిష్యత్తుకు గ్యారెంటీపై టీడీపీ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో ముస్లింవీధి, తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ నాయకులు సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు వేములపూడి అప్పారావు, ఆది, ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్‌ఫిల్‌కు అనుమతి వద్దు..

... 5వ పేజీ తరువాయి

కాలుష్యం వల్ల తాడి గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే భూగర్భజలాలు కలుషితమై తాడి గ్రామస్థులు అల్లాడిపోతుంటే మరో ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయాలని చూడడం దుర్మార్గమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ల్యాండ్‌ఫిల్‌ను ఏర్పాటు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఇదే సమయంలో తాడి గ్రామస్థులు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయొద్దని నినాదాలు చేశారు.

నిరసనతో సభ నుంచి నిష్క్రమణ

వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పంచకర్ల రమేశ్‌బాబు, బండారు అప్పలనాయుడు, కె.లోకనాథం, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన తరువాత సభ నుంచి బయటకు వెళ్లిపోతున్నామని, ల్యాండ్‌ఫిల్ ఏర్పాటును వ్యతిరేకించే వారంతా తమ వెంట రావాలని పిలుపునిచ్చారు. దీంతో తాడి గ్రామస్థులంతా ప్రజాభిప్రాయసేకరణ సభను బహిష్కరిస్తున్నట్టు చెప్పి బయటకు వెళ్లిపోయారు.

ప్రభుత్వం దృష్టికి ప్రజల అభిప్రాయాలు

జాహ్నవి, జాయింట్ కలెక్టర్

ప్రజాభిప్రాయసేకరణ సభలో ప్రజలు వ్యక్తపరిచిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని జేసీ జాహ్నవి స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయసేకరణ సభ అనంతరం ఆమె మాట్లాడుతూ, సభ జరిగిన తీరును వీడియో షూట్ చేశామని, ప్రజల మనోభావాలను గౌరవిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, పీసీబీ ఈఈ బి.నాగిరెడ్డి, తహసీల్దార్ కనకారావు, మాజీ ఎంపీపీలు మాదంశెట్టి నీలబాబు, పైలా జగన్నాథరావు, మాజీ సర్పంచులు బొడ్డపల్లి అప్పారావు, అట్టా సన్యాసిఅప్పారావు పాల్గొన్నారు.

డి.పట్టా భూముల్లో వైసీపీ నేతలు పాగా!

... 5వ పేజీ తరువాయి

చేయించారు. మిగిలిన భూమిని తనకు అనుకూలంగా వుండే 21 మంది వ్యక్తుల పేర్ల మీద పట్టాలు తయారు చేసి ఇచ్చాడు. అనంతరం కాలంలో సదరు వీఆర్ఏకు వీఆర్వోగా పదోన్నతి రావడంతో వేరే మండలానికి బదిలీ అయ్యాడు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం అనకాపల్లి నియోజకవర్గానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు ఈ భూముల గురించి ఆరా తీశారు. లబ్ధిదారులను వాకబు చేయగా పదేళ్ల క్రితం అప్పటి వీఆర్ఏ తమకు పట్టాలు తయారు చేసి ఇచ్చాడని చెప్పారు. దీంతో వైసీపీ నాయకులు నాటి వీఆర్ఏ (ప్రస్తుతం వీఆర్వో)ను పిలిపించి కూపీ లాగారు. మీకు ఇచ్చినవి నకిలీ పట్టాలని, తాము ఇచ్చిన డబ్బులు తీసుకుని, భూములు అప్పగించాలని, లేదంటే నకిలీ పట్టాలను రద్దు చేయిస్తామని హెచ్చరించారు. దీంతో నకిలీ లబ్ధిదారులు దిగివచ్చారు. వైసీపీ నాయకులకు ఎకరా రూ.13.5 లక్షల చొప్పున అనధికారికంగా విక్రయించారు. అధికార పార్టీ నాయకులు దాదాపు వారం రోజుల నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా ఎక్స్‌కవేటర్లు, బుల్డోజర్లు, బ్లేడ్ ట్రాక్టర్లతో ఎత్తు పల్లాలను సరిచేస్తున్నారు. ఈ భూములకు మధ్యలో నుంచి వెళుతున్న కాలువలు, గెడ్డలను కప్పేస్తున్నారు. డి.పట్టా భూములను భారీ ఎత్తున చదును చేయడమే కాకుండా పర్యావరణ విధ్వంసం జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, పంచాయతీ, గనుల శాఖల అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కాగా 20 ఏళ్లు దాటిన డి.పట్టా భూములను లబ్ధిదారులు అమ్ముకోవడానికి ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నది. అనంతరం ఆయా పట్టాదారుల పేరున రెవెన్యూ శాఖ ద్వారా ఎన్‌వోసీలు జారీ చేయించి, తరువాత రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అధికార పార్టీ నేతలు ముందస్తు ప్రణాళికతోనే భూదందాకు పాల్పడినట్టు తెలిసింది. ఈ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ వేసేందుకు సంబంధిత శాఖల అధికారులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా మిగిలిన 39 ఎకరాల బంజరు భూములను కూడా వైసీపీ నాయకులు, ప్రస్తుత అనుభవదారుల నుంచి కారుచౌకగా కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇక్కడ మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.60 నుంచి రూ.80 లక్షలు పలుకుతున్నది. కానీ వైసీపీ నాయకులు ఇందులో ఐదు వంతు రేటుకే భూములను చేజిక్కించుకున్నారు. ఖాళీ భూముల ద్వారానే సుమారు రూ.40 కోట్ల మేర ప్రయోజనం పొందారని, రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి ప్లాట్లుగా విక్రయిస్తే ఇంతకు మూడు రెట్లు ఆదాయం వస్తుందని స్థానికులు అంటున్నారు.

గంటాను కలిసిన అనిత

నక్కపల్లి, జనవరి 30: తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత మంగళవారం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును విశాఖలో మర్యాదపూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే అనిత గంటా శ్రీనివాసరావును కలిసి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఎన్నికల్లో తనకు సహకరించాలని ఆమె కోరగా, గంటా సానుకూలంగా స్పందించారు.



గంటాతో మాట్లాడుతున్న అనిత

'మత్స్యకార గ్రామాలాభివృద్ధికి అధిక ప్రాధాన్యం'

నక్కపల్లి,జనవరి 30: మత్స్యకార గ్రామాల అభివృద్ధికి, సదుపాయాల కల్పనకు తమ సంస్థ అధిక ప్రాధాన్యత ఇస్తోందని హెటెరో ఔషధ పరిశ్రమ ప్రతినిధులు ఎస్.కుల్లాయిరెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, రాజారెడ్డి చెప్పారు. మంగళవారం మండలంలోని పెదతీనార్లలో రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మైలపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయనగరంలో రీజనల్ జాబ్ మేళా

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 30 : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన విజయనగరం జిల్లా గాజులరేగ లో గల సత్యా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (సీతం) కళాశాలలో రీజనల్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి. చాముండేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో 80 కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు పూర్తి చేసిన యువత ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చునన్నారు.

ఆడుదాం ఆంధ్రా విజేతలకు బహుమతులు ప్రధానం

ఎలమంచిలి, జనవరి 30: క్రీడారంగంలో ఎలమంచిలి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆడుదాం ఆంధ్రాలో నియోజకవర్గ స్థాయిలో గెలుపొందినవారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆర్రెపు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం

కోటవురట్ల, జనవరి 30: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కొండబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఆటపాటలతోపాటు క్రమశిక్షణతో కూడిన విద్య బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో కాలేజి చైర్మన్ బ్రహ్మాజీ, అధ్యాపకులు గణేష్, రామాకోటి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల తీర్థం

సబ్బవరం, జనవరి 30: మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెంలో పైడితల్లమ్మ తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే అమ్మవార్లకు భక్తులు పూజలు చేశారు. సాయంత్రం సాము గరిడీలు, చిడతల భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారిని సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, గ్రామ పెద్దలు పాలిశెట్టి సురేష్‌రాజ్, కోటిరాజు, రెడ్డి శ్రీను, పల్లుణ, దేముడుబాబు, రాజేశ్ పాల్గొన్నారు.

పీటీడీ కార్మికుల నిరసన

అనకాపల్లి టౌన్, జనవరి 30 : స్థానిక పీటీడీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు మంగళవారం నిరసన తెలిపారు. విశాఖ డీపీటీవో ఎన్ఎంయూఏ సభ్యులపై కక్ష సాధింపు చర్యలను విడనాడాలని, సంస్థకు నష్టం కలిగించే చర్యలను ఆపాలని, కేంద్ర కార్యాలయం ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని, డీపీటీవోపై చర్యలు తీసుకోవాలని నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, ఏఎన్ రావు, ఎంవీఎస్‌కేపీ వర్మ, బంగార్రాజు, రామం పాల్గొన్నారు.

నిరుపేదలకు కంటి ఆపరేషన్లు

అనకాపల్లి టౌన్, జనవరి 30: స్థానిక ఏఎంఏఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఎనిమిది మంది నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. సోమవారం ఆస్పత్రికి 44 మంది కంటి పరీక్షలకు హాజరుకాగా నేత్ర వైద్య సహాయకులు పి.దేవి పరీక్షలు చేసి ఎనిమిది మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారని ఆస్పత్రి చైర్మన్ రవిరాం జవహర్ తెలిపారు. మంగళవారం ఈ ఎనిమిది మందికి డాక్టర్ కె. మల్లేశ్వరరావు ఐఓఎల్ ఆపరేషన్లు నిర్వహించారన్నారు. వీరికి ఐదు రోజులకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు.

'ఎయిడ్స్ రోగులు ప్రశాంతంగా జీవించాలి'

అనకాపల్లి టౌన్, జనవరి 30 : ఎయిడ్స్ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగించుకుని ప్రశాంతమైన జీవితం గడపాలని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ టీబీ అధికారి డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏపీసీఈపీటీ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ కార్యక్రమం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కల్పించనున్నట్టు వివరించారు. ఏక్సెస్ ప్రాజెక్టు డైరెక్టర్ వీవీఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రోగులకు ఎటువంటి కష్టం వచ్చినా సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వ వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ విశాఖ పీడీ కె. అనిల్‌కుమార్,డాక్టర్ ఏ. ప్రియదర్శిని, డీపీఆర్‌వో డి. సాయిబాబా, నారాయణ పాల్గొన్నారు.

పాయకరావుపేట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు

పాయకరావుపేట, జనవరి 30: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పాయకరావుపేటలో పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. స్థానిక నర్సీపట్నం రోడ్డులోని తాండవ షుగర్స్ సమీపంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద సీఐ పి.అప్పలరాజు, ఎస్ఐలు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు జరగనున్నందున నగదు, మద్యం, గంజాయి, సారా రవాణా నిరోధించడానికి చెక్‌పోస్టు చేశామన్నారు.

సుప్రీం తీర్పు జగన్‌రెడ్డికి చెంపపెట్టు : ప్రగడ

అచ్యుతాపురం, జనవరి 30: సుప్రీం కోర్టు తీర్పు జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుపై పెట్టిన కేసులన్నీ తప్పుడువేనని జగన్‌రెడ్డికి తెలిసినా.. కావాలని కేసులు పెట్టి ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారన్నారు.సమావేశంలో జనపరెడ్డి నరసింగరావు, శివ అప్పారావు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుకు వ్యతిరేకంగా నిరసన

ఎలమంచిలి, జనవరి 30: ల్యాండ్ టైటిలింగ్ యాక్టును నిరసిస్తూ ఎలమంచిలిలో న్యాయవాదులు నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ చట్టం రద్దు చేసేవరకూ నిరసన దీక్షలు కొనసాగిస్తామని బార్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాస పట్నాయక్, కూనిశెట్టి శ్రీనివాస్, న్యాయవాదులు లాలం రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మల్టీ డ్రగ్ థెరపీతో లెప్రసీ వ్యాధి నయం

ఎస్.రాయవరం, జనవరి 30: మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా లెప్రసీ వ్యాధి నయమవుతుందని సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ తెలిపారు. వరల్డ్ యాంటీ లెప్రసీ డే సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీలో కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె. గణేష్, వైద్య సిబ్బంది టి. నాగేశ్వరరావు, ఎస్ఎస్‌వి ప్రకాష్, ఎస్. సూర్యకుమారి, పీఎన్‌వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

గాం బోడిదొరకు వైద్యం అందించండి


బోడిదొరను పరామర్శిస్తున్న సంఘం నాయకులు

కృష్ణాదేవిపేట, జనవరి 30: స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగాలు చేసిన గిరిజన సమరయోధులను విస్మరించడం తగదని అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బ్రిటిష్ వారి తుపాకీగుళ్లకు బలైన గాం గంటందొర మనమడు గాం బోడిదొర కొంతకాలంగా అనారోగ్యం బారిన పడినా పట్టించుకునేవారు లేరని ఆరోపించారు. బోడిదొర అనారోగ్యంతో నరకయాతనతో బతుకుతున్నారని, మెరుగైన వైద్య సేవలు అందించాలని వీరభద్రరావు డిమాండ్ చేశారు. గాం బోడిదొరను సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణమ్మ, కోశాధికారి శ్యామల వరలక్ష్మి, కార్యదర్శి శివంగి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు వెళ్లి పరామర్శించారన్నారు.

6 నుంచి బీజేపీ పల్లెకు పోదాం

మాకవరపాలెం, జనవరి 30: వచ్చే నెల ఆరో తేదీ నుంచి నిర్వహించే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరావు అన్నారు. మంగళవారం రాచపల్లి కామేశ్వ రమ్మ గుడి వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మర్రినాయుడు, నాయకులు అడిగర్ల రాంబాబు, చుక్కల శ్రీను, అంజనేయులు, బత్తుల రమేష్ పాల్గొన్నారు.

భూహక్కుల చట్టానికి వ్యతిరేకంగా లాయర్ల నిరసన

నర్సీపట్నం, జనవరి 30: ఏపీ భూహక్కుల చట్టం-27కి వ్యతిరేకంగా నర్సీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు 63వ రోజూ నిరసన చేపట్టారు. మంగళవారం కోర్టు సముదాయం ముందు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదులు 63 రోజులుగా విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ చట్టాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి లోకా లోవరాజు, కామిరెడ్డి సత్యనారాయణ, అనిమిరెడ్డి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

391 మందికి వైద్య పరీక్షలు

దేవరాపల్లి, జనవరి 30: మండలంలోని కొత్తపెంటలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 391 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు వేచలం వైద్యాధికారి బి.హారిక తెలిపారు. 40 నేత్ర పరీక్షలు చేశామన్నారు. సర్పంచ్ వెంకటరావు మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో గైనికాలజిస్ట్ రోజారాణి, వైద్య సిబ్బంది మహమ్మద్ అమీర్, చిరికి శంకరరావు, చిరికి భూషణం పాల్గొన్నారు.

పాతమల్లంపేట సర్పంచ్ హెచ్చరికతో ఆగిన సచివాలయ భవన ప్రారంభం

- ఆ గ్రామంలో బీటి రోడ్డుకు శంకుస్థాపన చేసినా సచివాలయం ప్రారంభించని ఎమ్మెల్యే

గొలుగొండ, జనవరి 30: పాతమల్లంపేట సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి హెచ్చరికతో సచివాలయ భవన ప్రారంభాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ విరమించుకున్నారు. మంగళవారం మండలంలోని కొత్త మల్లంపేట, జోగంపేట, ఎర్రవరం గ్రామాల్లో సచివాలయాల నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. అలాగే పాతమల్లంపేట సచివాలయం ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే గ్రామ సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి సచివాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉందని, ప్రోటోకాల్ లేకుండా ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ప్రారంభించాలనుకుంటే అడ్డుకుంటామని ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. దీంతో భవన ప్రారంభంపై స్థానిక ఎస్‌ఐ కృష్ణారావు, పీఆర్ డీఈఈ ఈశ్వరరావు సర్పంచ్‌తో చర్చించారు. అయినప్పటికీ భవనం ప్రారంభించడానికి సర్పంచ్ ససేమిరా అనడంతో ఈ విషయాన్ని అధికారులు ఎమ్మెల్యే గణేశ్‌కు చెప్పారు.


పాతమల్లంపేటలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కాగా మంగళవారం అదే గ్రామంలో ఎమ్మెల్యే బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసి వెనుదిరిగారు తప్ప సచివాలయ భవనాన్ని ప్రారంభించలేదు. కొసమెరుపు ఏమిటంటే.. వైసీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణది అదే గ్రామపంచాయతీ కావడం గమనార్హం. కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈ సత్యనారాయణ, పీఆర్ డీఈఈ ఈశ్వరరావు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జడ్పీటీసీ సభ్యులు సుర్ల వెంకటగిరిబాబు, వైస్ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచులు పోలిరెడ్డి రాజబాబు, జువ్వల లక్ష్మి, లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నంలో..

మునిసిపాలిటీలోని బలిఘట్టం, గవరవీధిల్లో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ కుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ పాల్గొన్నారు.

నాతవరంలో..

మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్ మంగళవారం ప్రారంభించారు. గుమ్మిడిగొండలో సచివాలయం, గొలుగొండపేటలో రైతుభరోసా కేంద్రం, మన్యపురట్లలో సచివాలయం, మర్రిపాలెంలో హెల్త్‌క్లినిక్ సెంటర్ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మణమూర్తి, పామ్‌ఆయిల్ రాష్ట్రకార్పొరేషన్ డైరెక్టర్ పైల పోతురాజు, వైసీపీ నాయకులు లగుడు నాగేశ్వరరావు, శెట్టి నూకరాజు, గొర్లి వరహలబాబు, మిరపల వెంకటరమణ పాల్గొన్నారు.

నీటి సమస్య చెప్పడానికి వెళితే పోలీసులు తరిమేశారు..

- జోగంపేట మహిళల ఆవేదన

గొలుగొండ, జనవరి 30: నాలుగు నెలలుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న మహిళలు ఆ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంఘటన మండలంలోని జోగంపేటలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..

మండలంలోని జోగంపేటలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి కొళాయిల కోసం నీటి పథకం ఏర్పాటు చేశారు. అయితే నీటిఇ పథకం విద్యుత్ మోటారు నాలుగు నెలల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో సంక్షేమ హాస్టల్ వీధిలో ప్రజలకు తాగు నీరు అందడం లేదు. అయితే మంగళవారం ఎమ్మెల్యే గణేశ్ సచివాలయ భవనం ప్రారంభానికి గ్రామానికి వస్తున్నట్టు తెలియడంతో ఆ వీధిలో మహిళలు ఖాళీ బిందెలను పట్టుకొని తమ గోడును ఎమ్మెల్యేకు చెప్పుకోవాలని వేచిచూస్తున్నారు. ఈ సమయంలో పోలీసులు వచ్చి వారిని అక్కడ నుంచి వెళ్లిపొమ్మని హుకుం జారీ చేశారు. తమకు తాగునీరు రావడం లేదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతామని పోలీసులకు చెప్పినా వినకుండా మహిళలను పోలీసులు చెదరగొట్టారు. దీంతో మహిళలు ఇళ్లకు వెనుదిరిగారు.


జోగంపేటలో ఎమ్మెల్యే గణేష్ కోసం వేచి ఉన్న మహిళలను వెళ్లిపొమ్మంటున్న పోలీసులు

మహాత్మాగాంధీకి ఘన నివాళి

నర్సీపట్నం, జనవరి 30: పట్టణంలో వేర్వేరు చోట్ల మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కారుణ్య స్కూల్‌లో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీసాల సుబ్బన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నంగిన రమణ, నాయకులు పాల్గొన్నారు. అలాగే వాసవీ కల్యాణ మండపం వద్ద వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు తాటికొండ నారాయణ, అశోక్, గుప్తా, వెలగానారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

మాకవరపాలెంలో.. మండలంలో గాంధీ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. తామరం సచివాలయం వద్ద, మాకవరపాలెం హైస్కూల్ వద్ద గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మూర్తి, మాకవరపాలెం హైస్కూల్ హెచ్‌ఎం అచ్యుత్ రామయ్య తూర్పు కాపు సంఘం మండల అధ్యక్షుడు గొతింన హరిబాబు, తామరం ఉపసర్పంచ్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శిబాలదొర పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

నర్సీపట్నం అర్బన్, జనవరి 30 : స్థానిక మునిసిపాలిటీ పరిధిలోని పెదబొడ్డేపల్లి జంక్షన్‌లో వెలిసిన ఆంజనేయస్వామి తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు భజన బృందాలు ఆలపించిన భక్తిగీతాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఎన్నికలలో వైసీపీకి ప్రజలు బుద్ధి చెబుతారు

- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర

నాతవరం, జనవరి 30 : వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర అన్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. మండల ప్రజల సమస్యలపై జనసేన గళం వినిపించినా పాలకులు, అధికారులు పట్టించుకోలేదన్నారు. తాండవ లీకేజీలతో ఆయకట్టు రైతులు ఇబ్బంది పడినా ఎమ్మెల్యే గణేశ్ పట్టించుకోలేదన్నారు. జనసేన, టీడీపీ నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెలగల వెంకటరమణ, అశోక్‌నాయుడు, బద్రి, దేవాడ గోవిందు, ప్రసాద్, చినరాజు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కనీస పరిశుభ్రత పాటించరా?

- పనితీరు మార్చుకోకపోతే చర్యలు: డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

రావికమతం, జనవరి 30: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస పరిశుభ్రత పాటించరా? అని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పీహెచ్‌సీని మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రిలో దుమ్ము, ధూళి పట్టి ఉండడం, రోగులు కూర్చునే చోటే స్ట్రెక్చర్లు ఉండడ చూసి వైద్యాధికారి శ్రీనివాస్‌తో పాటు స్టాఫ్‌నర్సు, స్వీపర్లపై మండిపడ్డారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష సామగ్రి ఎక్కడికక్కడ పడి ఉండడంపై ఇది ఆసుపత్రా..? గోదామా..? అని ప్రశ్నించారు. అప్పటికప్పుడు ఆస్పత్రి మొత్తం పరిశుభ్రం చేయించారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అనంతరం ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు స్పెషలిస్టు వైద్యులు పాల్గొనేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని వివరించారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్వో

రావికమతం, జనవరి 30: మండలంలోని రావికమతం, చినపాచిల, కొమిర పోలింగ్ బూత్‌లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రమీలాగాంధీ మంగళవారం పరిశీలించారు. కొమిర బూత్‌లో మరుగుదొడ్ల మరమ్మతులు చేయాలని తహసీల్దార్ మహేశ్వరావును ఆదేశించారు. అలాగే దివ్యాంగుల బూత్ వద్దకు వెళ్లి ఓటు వేసేందుకు అనువుగా ఉండాలని, గుంతలను సరిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌వో కృష్ణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్యామ్ పాల్గొన్నారు.

జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన

మాడుగుల రూరల్, జనవరి 30: మండలంలోని కేజే పురం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మణి లక్ష్మణ్ మాట్లాడుతూ ఆవాసం లేని జంతువులను వధించరాదని చెప్పారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఖండివరం పశు వైద్యులు గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

- టీడీపీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, జనవరి 30: ఐఆర్ఆర్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు సీఎం జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టుని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు పేర్కొన్నారు. వడ్డాది పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో జగన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని వైసీపీ ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేయడం జగన్‌రెడ్డికి దిమ్మతిరిగిందన్నారు. అధికార గర్వంతో జగన్‌రెడ్డి అండ్ కో పెట్టిన కేసులపై సిగ్గుపడాలని దుయ్యపట్టారు. ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు పెడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. దేశంలో మహిళలపై నేరాల్లో ఏపీని ఆరో స్థానంలో నిలిపిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని విమర్శించారు. చంద్రబాబు హయాంలో అమలు చేసిన 100 సంక్షేమ పథకాలను రద్దు చేశారని ఆరోపించారు. నిజం గెలవడానికి ఆలస్యం కావచ్చుగాని, ఖచ్చితంగా గెలుస్తుందని జగన్‌రెడ్డి అర్థం చేసుకోవాలని హితవు పలికారు.



వైసీపీ ప్రభుత్వంలో గిరిజనులకు అన్యాయం

- జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు

రోలుగుంట, జనవరి 30: వైసీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ రాజు అన్నారు. మండలంలోని కొంతలం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన గిరిజన సదస్సులో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గిరిజనుల జీవన స్థితి అత్యంత అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాలకు కనీసం రోడ్లు కూడా వేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. చీమలపాడు పంచాయతీ గిరిజనులకు విద్య, వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములను దళారులు ఆక్రమించుకుని అన్యాయం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వానికి మద్దతు ప్రకటించి గెలిపిస్తే నియోజకవర్గంలో అన్ని గిరిజన గ్రామాలను శతశాతం అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు కేసరపూడి శివాజీ, మైచర్ల నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు బలిజి మహారాజు, పరవాడ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు

రూ.21.32 కోట్లతో రోడ్ల అభివృద్ధి: ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం, జనవరి 30: నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.21.32 కోట్ల నాబార్డు నిధులు మంజూరైనట్టు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ మంగళవారం తెలిపారు. ఈ నిధులతో రావికమతం, బుచ్చెయ్యపేట, రోలుగుంట మండలాల్లోని ఏడు రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అలాగే మండలంలోని లక్ష్మీపురం, ఖండేపల్లి పంచాయతీల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభించారు. లక్ష్మీపురంలో కమ్యూనిటీ హాలు, హెల్త్ సెంటర్లను, ఖండేపల్లి పంచాయతీలో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, పార్టీ మండల అధ్యక్షుడు డీవీఆర్, స్థానిక నాయకులు ఆదిగణపతి నాయుడు, సేనాపతి సత్యారావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి కామన్‌గుడ్ ఫండ్

చోడవరం, జనవరి 30: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కామన్‌గుడ్ ఫండ్ ఏర్పాటు చేయాలని పూర్వ విద్యార్థులు సంకల్పించారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలల్లో 1978-80 సంవత్సరానికి చెందిన పది నుంచి ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారంతా తాము చదువుకున్న ప్రాంతంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉపయోగపడేలా ఏమైనా చేయాలని సంకల్పించారు. ఈ మేరకు కామన్‌గుడ్ ఫండ్ ఏర్పాటు చేయాలని తీర్మానించి అక్కడికక్కడే విరాళాలు ప్రకటించారు. రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజినీరు వి.సత్యనారాయణమూర్తి, రిటైర్డ్ ఆడిటర్ కోటిపల్లి కృష్ణాజీ విరాళాలు అందించారు. అనంతరం కళాశాలను పరిశీలించి నాటి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మండల గౌరీశంకర్ పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళులు

చోడవరం/చోడవరం, జనవరి 30: జాతిపిత గాంధీజీ వర్ధంతిని నియోజవకర్గం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చోడవరం గ్రంథాలయంలో రిటైర్డ్ అధికారి సీతారామస్వామి, గ్రంథాలయాధికారి జి.తిరుమలకుమారి గాంధీజీ పోరాట స్ఫూర్తి గురించి మాట్లాడారు. బుచ్చెయ్యపేటలోని వడ్డాది కూడలిలో గాంధీ విగ్రహానికి వాసవీ క్లబ్ కోశాధికారి శ్రీనాథ సత్యారావు పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాలలో ఆయుర్వేద వైద్యులు ఎస్.దుర్గేష్‌కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అతిథి దేవోభవ సంస్థ కార్యదర్శి ఎ.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మదుముల నిర్మాణానికి ప్రాధాన్యం

- మండల సమావేశంలో సభ్యుల తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, అధికారులు

చీడికాడ, జనవరి 30: సాగునీటి చెరువుల్లో మదుముల నిర్మాణానికి ఉపాధి పథకంలో ప్రాధాన్యం ఇవ్వాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కురచా జయమ్మ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఉపాధి పథకంలో ప్రతి ఏటా చెరువుల్లో పూడికను తీయడానికి ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమైనప్పటికీ, సాగునీటి చెరువులకు వేసిన మదుములు శిథిలావస్థకు చేరడంతో పొలాలకు సాగునీరు వెళ్లడం లేదని పీఏసీఎస్ అధ్యక్షుడు నందారపు రమణబాబు, సభ్యులు పేర్కొన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తామని ఉపాధి పథకం ఏపీవో ఎస్.నాగరాజు తెలిపారు. మండలంలోని రోడ్లకిరువైపులా తుప్పలు పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని చీడిపల్లి సర్పంచ్ కసిరెడ్డి సూర్యనారాయణ కోరారు. అనంతరం మిగతా శాఖల అధికారులు వారి శాఖపరమైన అభివృద్ధిని వివరించారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులతో మండల పరిషత్ బడ్జెట్ సమావేశం జరిగింది. బడ్జెట్ వివరాలను మండల పర్యవేక్షకులు ఎం.కామేశ్వరరావు చదివి వినిపించగా, ఎంపీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమవేశంలో ఎంపీడీవో జయప్రకాశరావు, జడ్పీటీసీ సభ్యురాలు లాలం శారదవరలక్ష్మి, వైస్ ఎంపీపీలు కిముదు చిన్నమ్మలు, దర్మిశెట్టి స్వాతి, కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తప్పులే కుప్పలు!

... 5వ పేజీ తరువాయి

అధికారులు (బీఎల్‌ఓలు) క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా తుది జాబితాలను తయారు చేశారన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ముసాయిదా జాబితాల్లో డబుల్ ఎంట్రీలు (ఒక వ్యక్తికి రెండుచోట్ల ఓట్లు), చనిపోయిన, వలస పోయిన వారి పేర్లు వుండడాన్ని గతంలోనే అధికారుల దృష్టికి తీసుకువచ్చినా, ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని, యథావిధిగా తప్పుల తడకలతో జాబితాలను విడుదల చేశారని అంటున్నారు. అదే విధంగా ఒకే ఇంటి నంబరుపై పదుల సంఖ్యలో ఓట్లు నమోదు వంటి తప్పిదాలను కూడా సరి చేయలేదని విపక్షాల నాయకులు ఆరోపిస్తున్నారు.

జాబితాల్లో చనిపోయిన వారు పేర్లు!

అనకాపల్లి నియోజకవర్గంలో (జీవీఎంసీ పరిధి) పోలింగ్ బూత్ 234లో వరుస సంఖ్య 3లో వున్న వీరాల జగ్గారావు, 220వ బూత్‌లో వరుస సంఖ్య 93లో మైపాలి ఉదయలక్ష్మి, వరుస సంఖ్య 147లో వేల్పుల రాము, వరుస సంఖ్య 150లో వేల్పుల భూలక్ష్మి, వరుస సంఖ్య 348లో దూలం నాగభూషణమ్మ, వరుస సంఖ్య 487లో భీశెట్టి భావన, వరుస సంఖ్య 699లో మద్దాల కేదారి మృతిచెందినప్పటికీ వారు పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. పోలింగ్ బూత్ 220 వరుస సంఖ్య 101లో కాండ్రేగుల తవుడుబాబు, వరుస సంఖ్య 118లో దాడి బలరామ్, వరుస సంఖ్య 1,085లో కొణతాల భూలోకమ్మ, వరుస సంఖ్య 1,103లో కొణతాల వరహా వెంకట నూకరాజు చనిపోయినప్పటికీ వీరి పేర్లు జాబితాలో యథావిధిగా ఉన్నాయి. వీరిలో కొంతమంది చనిపోయి రెండు, మూడేళ్లు అవుతున్నదని, అయినప్పటికీ ఓటరు జాబితాల్లో నుంచి తొలగించకపోవడంతో బీఎల్‌వోల పనితీరుకు అద్దం పుడుతున్నదని విపక్ష నేతలు ఎద్దేవా చేస్తున్నారు. కాగా 219వ పోలింగ్ బూత్ పరిధిలో నివాసం వుంటున్న వారిలో కొంతమందికి పోలింగ్ బూత్ 216లో ఓట్లు వున్నాయి.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

జిల్లా ఎన్నికల అధికారులు ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాల్లోనూ తప్పులు కొనసాగాయి. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిల పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తుది ఓటర్ల జాబితాల్లో తప్పులను గుర్తించే కార్యక్రమం కొనసాగుతున్నది. ముసాయిదా జాబితాల్లో దొర్లిన తప్పిదాలపై ఫిర్యాదులు చేసినా.. ఎన్నికల అధికారులు పట్టించుకోలేదు. అధికార పార్టీకి మేలు చేకూర్చేలా తుది ఓటర్ల జాబితాలను విడుదల చేశారు. వీటిపై ఎన్నికల కమిషన్‌ను ఫిర్యాదు చేస్తాం. జాబితాల్లో లోపాలను సవరించేందుకు మళ్లీ అర్జీలు స్వీకరించడమే కాకుండా రాజకీయ పార్టీలు అందజేసే నివేదికలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తాం.

ల్యాండ్‌ఫిల్‌కు అనుమతి వద్దు

... 5వ పేజీ తరువాయి

కాలుష్యం వల్ల తాడి గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే భూగర్భజలాలు కలుషితమై తాడి గ్రామస్థులు అల్లాడిపోతుంటే మరో ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయాలని చూడడం దుర్మార్గమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ల్యాండ్‌ఫిల్‌ను ఏర్పాటు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఇదే సమయంలో తాడి గ్రామస్థులు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయొద్దని నినాదాలు చేశారు.

నిరసనతో సభ నుంచి నిష్క్రమణ

వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పంచకర్ల రమేశ్‌బాబు, బండారు అప్పలనాయుడు, కె.లోకనాథం, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసిన తరువాత సభ నుంచి బయటకు వెళ్లిపోతున్నామని, ల్యాండ్‌ఫిల్ ఏర్పాటును వ్యతిరేకించే వారంతా తమ వెంట రావాలని పిలుపునిచ్చారు. దీంతో తాడి గ్రామస్థులంతా ప్రజాభిప్రాయసేకరణ సభను బహిష్కరిస్తున్నట్టు చెప్పి బయటకు వెళ్లిపోయారు.

ప్రభుత్వం దృష్టికి ప్రజల అభిప్రాయాలు

జాహ్నవి, జాయింట్ కలెక్టర్

ప్రజాభిప్రాయసేకరణ సభలో ప్రజలు వ్యక్తపరిచిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని జేసీ జాహ్నవి స్పష్టం చేశారు. ప్రజాభిప్రాయసేకరణ సభ అనంతరం ఆమె మాట్లాడుతూ, సభ జరిగిన తీరును వీడియో షూట్ చేశామని, ప్రజల మనోభావాలను గౌరవిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, పీసీబీ ఈఈ బి.నాగిరెడ్డి, తహసీల్దార్ కనకారావు, మాజీ ఎంపీపీలు మాదంశెట్టి నీలబాబు, పైలా జగన్నాథరావు, మాజీ సర్పంచులు బొడ్డపల్లి అప్పారావు, అట్టా సన్యాసిఅప్పారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలం లీజుపై రగడ

... 5వ పేజీ తరువాయి

సాయంత్రం అనకాపల్లి ఆర్టీసీ డీఎం సుజాత, ఇతర అధికారులు, తహసీల్దార్ బి.తిరుమలబాబు, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ ఈవో నారాయణరావు, తదితరులు ఇక్కడకు వచ్చి స్థలం సర్వేకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు వచ్చి సర్వేను అడ్డుకున్నారు. ఇదే సమయంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, జనసేన నాయకుడు జెర్రిపోతుల నానాజీ, తదితరులు తహసీల్దార్ బి.తిరుమలబాబును అడ్డుకున్నారు. ఆర్టీసీ స్థలం లీజు పేరుతో సాగునీటి చెరువుకు వర్షం నీరు వచ్చే కాలువలు, పంచాయతీ స్థలాలను కప్పివేసే అధికారం లీజుదారులకు ఎవరిచ్చారంటూ వాదనకు దిగారు. చెరువు మొత్తం 31 ఎకరాల విస్తీర్ణంలో వుందని, పూర్తిగా సర్వే చేసిన తరువాతే ఆర్టీసీ స్థలం సర్వే చేయాలని స్పష్టం చేశారు. ఆర్టీసీ స్థలం లీజుతో తమకు సంబంధం లేదని, కానీ వాస్తవంగా చెరువు విస్తీర్ణం 39 ఎకరాలు ఉందని, చెరువు స్థలాన్ని సమగ్రంగా సర్వే చేసి అందులో ఆర్టీసీ స్థలం ఏదో నిర్ధారించాలని సీపీఐ నాయకుడు రెడ్డిపల్లి అప్పలరాజు, తహసీల్దార్‌ను కోరారు.

లీజుదారులకు, పంచాయతీ సభ్యులకు మధ్య ఘర్షణ

ఆర్టీసీ స్థలం సర్వే సందర్భంగా లీజుదారులకు, పంచాయతీ వార్డు సభ్యులకు మధ్య మాటామాటా పెరగడంతో తోపులాట చేసుకుంది. ఒక దశలో పంచాయతీ వార్డు సభ్యులు... లీజుదారులపై తిరగబడడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆర్టీసీ స్థలం కప్పివేయడంతో దిగువున ఉన్న చెరువు ఆయకట్టు పరిధిలోని రైతులు నష్టపోతారని, పంచాయతీ వార్డు సభ్యుడు కందర్ప శంకర్, జనసేన నాయకుడు నానాజీ తదితరులు ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం లీజుదారులు కప్పివేసిన కాలువ, చెరువుతోపాటు, దీనికింద ఉన్న ఆయకట్టు భూములను జనసేన, సీపీఐ నాయకులు ఆర్టీసీ డీఎం సుజాతను తీసుకెళ్లి చూపించారు.

కాగా ఆర్టీసీ స్థలంతోపాటు మొత్తం చెరువు స్థలాన్ని సర్వే చేయాలని స్థానికులు, పంచాయతీ సభ్యులు, విపక్షాల నాయకులు పట్టుబడుతున్నందున ఆర్టీసీ స్థలం సర్వే చేయడానికి తమకు కొంత సమయం కావాలని తహసీల్దార్ బి.తిరుమలబాబు, ఆర్టీసీ అధికారులకు స్పష్టం చేశారు..

డి.పట్టా భూముల్లో వైసీపీ నేతలు పాగా!

... 5వ పేజీ తరువాయి

చేయించారు. మిగిలిన భూమిని తనకు అనుకూలంగా వుండే 21 మంది వ్యక్తుల పేర్ల మీద పట్టాలు తయారు చేసి ఇచ్చాడు. అనంతరం కాలంలో సదరు వీఆర్ఏకు వీఆర్వోగా పదోన్నతి రావడంతో వేరే మండలానికి బదిలీ అయ్యాడు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం అనకాపల్లి నియోజకవర్గానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు ఈ భూముల గురించి ఆరా తీశారు. లబ్ధిదారులను వాకబు చేయగా పదేళ్ల క్రితం అప్పటి వీఆర్ఏ తమకు పట్టాలు తయారు చేసి ఇచ్చాడని చెప్పారు. దీంతో వైసీపీ నాయకులు నాటి వీఆర్ఏ (ప్రస్తుతం వీఆర్వో)ను పిలిపించి కూపీ లాగారు. మీకు ఇచ్చినవి నకిలీ పట్టాలని, తాము ఇచ్చిన డబ్బులు తీసుకుని, భూములు అప్పగించాలని, లేదంటే నకిలీ పట్టాలను రద్దు చేయిస్తామని హెచ్చరించారు. దీంతో నకిలీ లబ్ధిదారులు దిగివచ్చారు. వైసీపీ నాయకులకు ఎకరా రూ.13.5 లక్షల చొప్పున అనధికారికంగా విక్రయించారు. అధికార పార్టీ నాయకులు దాదాపు వారం రోజుల నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా ఎక్స్‌కవేటర్లు, బుల్డోజర్లు, బ్లేడ్ ట్రాక్టర్లతో ఎత్తు పల్లాలను సరిచేస్తున్నారు. ఈ భూములకు మధ్యలో నుంచి వెళుతున్న కాలువలు, గెడ్డలను కప్పేస్తున్నారు. డి.పట్టా భూములను భారీ ఎత్తున చదును చేయడమే కాకుండా పర్యావరణ విధ్వంసం జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, పంచాయతీ, గనుల శాఖల అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కాగా 20 ఏళ్లు దాటిన డి.పట్టా భూములను లబ్ధిదారులు అమ్ముకోవడానికి ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నది. అనంతరం ఆయా పట్టాదారుల పేరున రెవెన్యూ శాఖ ద్వారా ఎన్‌వోసీలు జారీ చేయించి, తరువాత రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి అధికార పార్టీ నేతలు ముందస్తు ప్రణాళికతోనే భూదందాకు పాల్పడినట్టు తెలిసింది. ఈ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ వేసేందుకు సంబంధిత శాఖల అధికారులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలావుండగా మిగిలిన 39 ఎకరాల బంజరు భూములను కూడా వైసీపీ నాయకులు, ప్రస్తుత అనుభవదారుల నుంచి కారుచౌకగా కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇక్కడ మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.60 నుంచి రూ.80 లక్షలు పలుకుతున్నది. కానీ వైసీపీ నాయకులు ఇందులో ఐదు వంతు రేటుకే భూములను చేజిక్కించుకున్నారు. ఖాళీ భూముల ద్వారానే సుమారు రూ.40 కోట్ల మేర ప్రయోజనం పొందారని, రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి ప్లాట్లుగా విక్రయిస్తే ఇంతకు మూడు రెట్లు ఆదాయం వస్తుందని స్థానికులు అంటున్నారు.